# ప్రపంచాన్ని శాఖాహార జగత్తుగా మార్చడమే లక్ష్యం

**పీఎస్ఎస్ఎం గ్లోబల్ వ్యవస్థాపకురాలు పరిమళ పత్రీ**
**ధ్యాన మహాయాగంలో పాల్గొన్న పిరమిడ్ మాస్టర్లు, ధ్యానులు**
**పలు ఆధ్యాత్మిక పుస్తకాలను ఆవిష్కరించిన నిర్వాహకులు**


మహాయాగంలో ధ్యానులనుద్దేశించి మాట్లాడుతున్న పరిమళ పత్రీ

కడ్తాల్, డిసెంబర్ 23 : ప్రపంచంలో ప్రతిఒక్కరూ శాఖాహారిగా మారాలన్నదే ది పిరమిడ్ స్పిరిచ్యువల్ మూవ్‌మెంట్ ఆఫ్ ఇండియా లక్ష్యమని ఆ సంస్థ వ్యవస్థాపకురాలు పరిమళ పత్రీ అన్నారు. ధ్యాన సాధనతో ఆనందమయ జీవితాన్ని గడపవచ్చని, ఒత్తిడిని జయించవచ్చని ధ్యాన గురువు సుభాష్ పత్రీజీ పేర్కొన్నట్లు తెలిపారు. కడ్తాల్ సమీపంలోని కైలాసపురి మహేశ్వర మహా పిరమిడ్‌లో జరుగుతున్న పత్రీజీ ధ్యాన మహాయాగం-2 శనివారం మూడో రోజుకు చేరుకుంది. ఉదయం 5 గంటల నుంచి 8 గంటల వరకు ప్రాతఃకాలంలో నిర్వహించిన సంగీత ధ్యానంలో తెలుగు రాష్ట్రాల నుంచి ధ్యానులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

ఈ సందర్భంగా పరిమళ పత్రీ మాట్లాడుతూ.. నిత్యం ధ్యాన సాధన చేసి ఆత్మను శుద్ధి చేసుకోవాలన్నారు. మనం ఏది చదువుతామో అదే మన దైనందిన జీవితంలో ప్రతిబింబిస్తుందని పేర్కొన్నారు. ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక పుస్తకాలను చదివి ఆత్మజ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు. మనలో ప్రాపంచిక ఎదుగులతోపాటు ఆధ్యాత్మిక ఎదుగుదల కూడా ఉండాలని తెలిపారు. అందరితో ప్రేమానురాగాలతో మెలగాలని పేర్కొన్నారు. జంతు జాతి పట్ల జాలి, కరుణ, దయ కలిగి ఉండాలన్నారు. జంతువులను వధించడం అనాగరిక చర్య అని ఆమె పేర్కొన్నారు. అనంతరం రచయిత్రి రమాదేవి అనువదించిన 'ఆలోచన-గమ్యం', విశ్రాంత హెచ్ఎం గిరినాథరావు రచించిన 'ఆత్మోపదేశం' పుస్తకాలను ఆవిష్కరించారు. మహాయాగం సందర్భంగా నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకుంటున్నాయి.

ప్రముఖ గాయకుడు కారుణ్య ఆలపించిన గీతాలు ధ్యానులను అలరించాయి. కార్యక్రమంలో పిరమిడ్ ట్రస్ట్ చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, సభ్యులు బాలకృష్ణ, సాంబశివరావు, రాంబాబు, హనుమంతురాజు, దామోదర్‌రెడ్డి, శివప్రసాద్, శ్రీరాంగోపాల్, జయశ్రీ, మాధవి, లక్ష్మి పాల్గొన్నారు.



షాబాద్ : ముక్కోటి ఏకాదశి సందర్భంగా శనివారం తెల్లవారుజామున తిరుమల తిరుపతి వేంకటేశ్వరస్వామిని చేవెళ్ల ఎంపీ డా. గడ్డం రంజిత్‌రెడ్డి, వారి సతీమణీ టీటీడీ బోర్డు మెంబర్ సీతారెడ్డి, చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య దర్శించుకున్నారు.

యాచారం : మండలంలోని కుర్మిద్ద గ్రామానికి అనుబంధంగా ఉన్న మంగలి గడ్డతండా, మర్లకుంట తండాలను నూతన గ్రామపంచాయతీగా ఏర్పాటు చేయాలని తండాకు చెందిన గిరిజనులు సర్పంచ్ రాజశేఖర్‌రెడ్డి, నాయకుడు శ్రీకాంత్ ఆధ్వర్యంలో శనివారం రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్కను కలిసి వినతిపత్రాన్ని అందజేసి సమస్యను పరిష్కరించాలని కోరారు.


# సమన్వయంతో పనిచేస్తాం

- సైబరాబాద్‌లో 7 శాతం పెరిగిన నేరాలు
- చట్ట ప్రకారం ఎవరి పని వారు చేయాల్సిందే..
- ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి ఎప్పటికప్పుడు చర్యలు
- సైబరాబాద్ పోలీస్ కమిషనర్ అవినాష్ మహంతి


సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో వార్షిక నివేదిక విడుదల చేసిన సందర్భంగా మాట్లాడుతున్న సీపీ అవినాష్ మహంతి

సిటీబ్యూరో, డిసెంబర్ 23 (నమస్తే తెలంగాణ) : సైబరాబాద్‌లో 7 శాతం నేరాలు పెరిగాయని, పోలీస్‌స్టేషన్‌కు వచ్చే వారి ఫిర్యాదులు తీసుకొని ఎవరు చేసే పని వారు చట్ట ప్రకారం చేస్తూ కేసుల దర్యాప్తును పారదర్శకంగా చేయాలని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ అవినాష్ మహంతి సూచించారు. శనివారం సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో కమిషనరేట్ 2023 వార్షిక నివేదికను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. గత ఏడాది 27322 కేసులు నమోదు కాగా 2023లో 29156 నమోదయ్యాయన్నారు. ఆస్తుల రికవరీలో 9 శాతం పెరుగుదల ఉందని వెల్లడించారు. ఈ ఏడాది తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించామన్నారు. 3432 కేసుల్లో నిందితులకు న్యాయస్థానాలు ఆయా కేసుల్లో జైలు శిక్ష విధించాయని వివరించారు. సైబర్ నేరాలు ప్రతి యేడు పెరుగుతున్నాయని.. అదే విధంగా ఈ సంవత్సరం కూడా పెరిగాయని.. సైబర్ నేరాల్లో పోయిన సొమ్ము విలువ రూ.232.34 కోట్లు ఉండగా రూ.46 కోట్ల రికవరీ జరిగిందని వెల్లడించారు. ట్రాఫిక్ విషయంలో ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని, అన్ని విభాగాలను సమన్వయం చేసుకుంటూ మానవ వనరులను సద్వినియోగం చేసుకుంటామన్నారు. ఆర్థిక నేరాలు, భూ సంబంధిత నేరాలకు సంబంధించిన కేసులు ఎక్కువగా ఉంటున్నాయని, వీటిని ఎప్పటికప్పుడు చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు.

### అధికారుల పనితీరుపై పరిశీలన

చట్ట ప్రకారం ఎవరి పని వాళ్లు చేస్తూ వెళ్లాల్సిన అవసరముందన్నారు. పోలీస్‌స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్ స్థాయిలో సమస్యను పట్టించుకోలేదంటే ఏసీపీ, అదనపు డీసీపీ, డీసీపీలకు ఫిర్యాదు చేయాలని.. అక్కడ కూడా పరిష్కారం కాకపోతే తన వద్దకు సామాన్య ప్రజలు రావచ్చని సూచించారు. అధికారుల పనితీరుపై ఎప్పటికప్పుడు పరిశీలన ఉంటుందన్నారు. పైరవీలతో పోస్టింగ్‌లు ఉండవని, పనితీరు ఆధారంగానే పోస్టింగ్‌లుంటాయన్నారు. డ్రగ్స్ కేసుల్లో డ్రగ్స్ వాడినట్లు ఆధారాలుంటే చర్యలు తీసుకుంటామన్నారు. ఎన్డీపీఎస్ యాక్ట్‌లో అది ఉందని, దానిని అమలు చేస్తామన్నారు. డ్రగ్ పెడ్లర్స్, డ్రగ్స్ తయారీదారులతోపాటు వినియోగదారులపై నిఘా కొనసాగుతుందన్నారు. న్యూ ఇయర్ వేడుకలను నిర్వహించే వారు తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలన్నారు. అర్ధ రాత్రి ఒంటి గంట వరకు వేడుకలు ముగించేయాలని సూచించారు. సమావేశంలో డీసీపీలు శబరీష్, శ్రీనివాస్‌రావు తదితర అధికారులు పాల్గొన్నారు.

### ఆ కేసులను పరిశీలిస్తున్నాం

సమావేశంలో విలేకరులు పలు అంశాలను ప్రస్తావించారు. అందులో మొయినాబాద్ ఫామ్ హౌస్‌కు సంబంధించి ఎమ్మెల్యేల కొనుగోలు కేసు ఎంత వరకు వచ్చిందని ప్రశ్నించగా.. అది సుప్రీంకోర్టు విచారణలో ఉందన్నారు. అలాగే మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌కు సంబంధించి పేట్‌బషీర్‌బాగ్‌లో నమోదైన కేసు ఎంత వరకు వచ్చిందని ప్రశ్నించగా.. కేసు దర్యాప్తులో ఉందని, పరిశీలించాల్సి ఉందన్నారు. డ్రోన్ ఎగురవేతకు సంబంధించిన కేసును కూడా పరిశీలించాల్సి ఉందన్నారు. రాయదుర్గంలో నమోదైన సినీ నిర్మాత కేపీ చౌదరి డ్రగ్స్ కేసుతో సంబంధమున్న వారిపై కూడా దర్యాప్తు జరుగుతున్నదని, కొందరికి నోటీసులిచ్చామన్నారు. సైబరాబాద్‌లో నమోదై గతంలో పెండింగ్‌లో ఉన్న కేసులను పరిశీలించాల్సి ఉందని, ఆ తరువాత ఆ కేసులకు సంబంధించిన పూర్తి వివరాలు వెల్లడించగలమని సీపీ తెలిపారు.

| క్రైమ్ వివరాలు | 2022 | 2023 |
|---|---|---|
| నమోదైన కేసులు | 27322 | 29156 |
| ఆస్తి సంబంధిత నేరాలు | 3435 | 2904 |
| ఈ నేరాల్లో డిటెక్షన్ | 2013 | 1845 |
| పోయిన సొత్తు విలువ | రూ.24,10,35,971 | రూ.24,90,27,844 |
| రికవరీ | రూ.15,13,26,294 | రూ.17,91,87,648 |
| మహిళలపై జరిగిన నేరాలు | 2489 | 2356 |
| ఎస్సీ/ఎస్టీ కేసులు | 158 | 133 |
| రోడ్డు ప్రమాదాలు | 3224 | 3143 |
| సైబర్ నేరాలు | 4850 | 5342 |
| సైబర్ నేరాల్లో పోయిన సొత్తు | రూ.66,66,55,124 | రూ.232,34,84,557 |
| ఈ నేరాల్లో సీజ్ చేసిన విలువ | రూ.7,57,94,476 | రూ.46,00,37,222 |

## సహకార రుణాలు అందజేయాలి


డీసీసీబీ చైర్మన్ సత్తయ్యకు వినతిపత్రమిస్తున్న ప్రతాప్ తదితరులు

తుర్కయాంజాల్, డిసెంబర్ 23 : ప్రభుత్వం హక్కులు కల్పించిన భూములకు సహకార బ్యాంకులు రుణాలు కల్పించాలని కోరుతూ బీజేపీ రాష్ట్ర శిక్షణ కమిటీ సభ్యుడు బోసుపల్లి ప్రతాప్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లచ్చిరెడ్డి ఆధ్వర్యంలో శనివారం డీసీసీబీ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడుతూ.. ప్రభుత్వ హక్కులు పొందిన భూములపై గత 13 సంవత్సరాలుగా రుణాలివ్వడం లేదని కేంద్ర సహకార కేంద్ర బ్యాంకు ద్వారా వారికి రుణాలు అందజేయాలని కోరారు. కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షుడు రమేశ్, నాయకులు శ్రావణ్‌కుమార్, నర్సింహ, శ్రీకాంత్ పాల్గొన్నారు.

## పందులకు వ్యాక్సిన్లు వేయించాలి

**జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ అనీల్‌కుమార్**

వికారాబాద్, డిసెంబర్ 23 : వికారాబాద్ జిల్లాలోని అన్ని మండలాల్లో నేటి నుంచి ఈ నెల 30 వరకు మూడు నెలలు పైబడిన పందుల్లో వ్యాపించే క్లాసికల్ స్వైన్ ఫీవర్ వ్యాధి నిర్మూలనకు పందుల కాపరులు తమ పందులకు తప్పనిసరిగా టీకాలు వేయించాలని జిల్లా పశువైద్యాధికారి డా.అనిల్ కుమార్ తెలిపారు. క్లాసికల్ స్వైన్ ఫీవర్ అనే వ్యాధి సోకితే పందుల్లో జ్వర తీవ్రత ఎక్కువగా ఉంటుందన్నారు. కండ్లు ఎర్రబడి నీరసంగా ఉండి నరాల బలహీనతతో నడకలో మార్పు వచ్చి పందులు చనిపోతాయని తెలిపారు. జిల్లాలోటీకాల కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జిల్లాలో 9,940 పందులున్నాయని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏడీ డా.ప్రహ్లాద్, సిబ్బంది హాజీ, జగన్ పాల్గొన్నారు.

## విద్యార్థుల సామర్థ్యాన్ని పెంచాలి

పూడూరు, డిసెంబర్ 23 : విద్యార్థుల సామర్థ్యాలు పెంపొందేలా విద్యాబోధన చేపట్టాలని ఎంఈవో హరిశ్చందర్ పేర్కొన్నారు. శనివారం పూడూరు మండలం మన్నెగూడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రేరణ(ఎఫ్ఎల్ఎన్)లో భాగంగా ఉపాధ్యాయులకు ఒక రోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థిపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టిపెట్టి ఎప్పటికప్పుడు చదువుతో పాటు హోంవర్క్ పూర్తి చేసేలా చూడాలన్నారు. పాఠశాలలో విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచాలన్నారు. పిల్లలు బడికి రాకుంటే వారి తల్లిదండ్రులను సంప్రదించి బడికి వచ్చేలా చూడాలని ఆయన సూచించారు.

## వీర్లపల్లిలో ఉచిత వైద్య శిబిరం

నందిగామ, డిసెంబర్ 23 : నందిగామ మండలం వీర్లపల్లి గ్రామంలో శనివారం జిమ్స్ హోమియోపతిక్ మెడికల్ కళాశాల, హాస్పిటల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని వీర్లపల్లి సర్పంచ్ రాములమ్మ ప్రారంభించారు. వైద్య శిబిరంలో రోగులకు పలు రకాల వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు.

## గండీడ్ మండలాన్ని వికారాబాద్ జిల్లాలో కలుపొద్దు

వికారాబాద్, డిసెంబర్ 23 : మహబూబ్‌నగర్ జిల్లాలోని గండీడ్ మండలాన్ని వికారాబాద్ జిల్లాలో కలుపొద్దని వికారాబాద్ ప్రాంత యువకులు, నిరుద్యోగులు కోరుతున్నారు. శనివారం వికారాబాద్ స్థానిక అంబేద్కర్ భవనంలో బీఆర్ఎస్ పార్టీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి రాజేందర్‌గౌడ్‌ను నిరుద్యోగులు కలిసి సమస్యను వివరించారు. తాము చేస్తున్న పోరాటానికి మద్దతు ప్రకటించాలని కోరారు. ఈ విషయంలో సానుకూలంగా స్పందించి వారి పోరాటంలో భాగస్వామ్యం అవుతానని చెప్పారు. వెంటనే కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలకు వినతిపత్రం ఇచ్చారు.

నిరుద్యోగులతో కలిసి కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలకు వినతిపత్రం అందజేసిన బీఆర్ఎస్ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి రాజేందర్‌గౌడ్




జాతీయ సదస్సులో పాల్గొన్న ప్రొఫెసర్లు

## ఫార్మా రంగంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్

తుర్కయాంజాల్, డిసెంబర్ 23 : ఫార్మా రంగంలో ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్(ఏఐ) ప్రభావం విస్తరిస్తున్నని ప్రొఫెసర్ ప్రమోద్‌కుమార్ రాజ్‌పుత్ అన్నారు. తుర్కయాంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని సెయింట్ పాల్స్ కాలేజ్ ఆఫ్ ఫార్మసీలో ఫార్మా రంగంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ)పై రెండు రోజుల జాతీయ సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రమోద్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఏఐపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం డాక్టర్ సోమేశ్వర్, డాక్టర్ లిజోజాన్ ఏఐ ఆవశ్యకతను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు సరబ్‌జిత్ సిద్ధూ, రాజాసింగ్, అజిత్‌సింగ్, కళాశాల యాజమాన్యం సుధీర్, రాఘవరెడ్డి, ప్రిన్సిపాల్ పాల్గొన్నారు.